సాగుపై ఆశలు

- ఇప్పటికి లోటు వర్షపాతమే - వర్షాలు పడుతుండటంతో రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పంటల సాగుపై రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటి వరకూ లోటు వర్షపాతమే నమోదైనా వర్షాలు కురుస్తుండటంతో సాగు చేసేందుకు రైతులు ఇంకా ఎదురుచూస్తున్నారు...

తొలకరి వర్షం పడి నెల రోజులు గడిచినా వర్షాలు లేకపోవడంతో మొన్నటి వరకూ పంటల సాగు మీద రైతులు ఆశలు వదిలేసుకున్నారు. తాజాగా వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పంటల సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ లోటు వర్షపాతమే నమోదైంది. జిల్లాలో జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మిల్లీమీటర్లు కాగా ఈ ఏడాది 46.9 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. 40 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జులై నెల సాధారణ వర్షపాతం 90.7 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకూ 68.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకూ 25 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. ఈ నెలలో ఇప్పటి వరకూ జిల్లాలోని 26 మండలాల్లో 6 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతానికి మించి వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాధారణ సాగులో కేవలం 8.2 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 10,53,900 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 86,770 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు ఆశించిన రీతిలో పడకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే పత్తి సాధారణ సాగు 6,25,067.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 65,155 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 10.4 శాతం పంట మాత్రమే సాగైంది. వర్షం లేకపోవడం వల్ల ఇప్పటికే పలు ప్రాంతాల్లో పత్తి చెట్లు ఎండిపోతున్నాయి. వేరుశనగ సాధారణ సాగు 1,66,407.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 10,755 ఎకరాల్లో మాత్రమే విత్తనాలు వేశారు. వరి సాధారణ సాగు 32,272.5 ఎకరాలు కాగా 30 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కంది సాధారణ సాగు 59,822.5 ఎకరాలు కాగా 2,520 ఎకరాల్లో, ప్రొద్దుతిరుగుడు సాధారణ సాగు 1,490 ఎకరాలు కాగా 287.5 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. ఆముదం సాధారణ సాగు 20,357.5 ఎకరాలు కాగా 2,562.5 ఎకరాల్లో, మిరప సాధారణ సాగు 48,410 ఎకరాలు కాగా 1240 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూటగట్టుకోవడంతో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉల్లి సాధారణ సాగు 38,582.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1267.5 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. టమోట సాధారణ సాగు 5,257.5 ఎకరాలు కాగా 190 ఎకరాల్లో సాగు ప్రారంభించారు. ఇతర పంటల సాధారణ సాగు విస్తీర్ణం 29,175 కాగా 1,967.5 ఎకరాల్లో సాగు చేశారు. వరుసగా కురుస్తున్న వర్షానికి మళ్లీ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మహిళలకు అండగా శిశు సంక్షేమ శాఖ

ప్రజాశక్తితో పత్తికొండ సిడిపిఒ సావిత్రి

ప్రజాశక్తి-పత్తికొండ

'రాష్ట్రప్రభుత్వం శిశు సంక్షేమ శాఖకు ప్రత్యేక నిధులు కేటాయించి, మహిళల అభివృద్ధికి తోడ్పడుతుంది. అంగన్‌వాడీ సెంటర్లలో 4 నుంచి 5 నెలలు నిండిన గర్భవతులకు శ్రీమంతాలు ,36 నెలల పిల్లలకు అన్న ప్రాసన, ప్రజా ఆరోగ్య వేడుకలను , వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, పలురకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది.' అని పత్తికొండ సిడిపిఒ సావిత్రి పేర్కొన్నారు. ఆమె ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు..

ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఎన్ని మండలు, భవనాలు ,అద్దె భవనాలు ఎన్ని ఉన్నాయి?

సిడిపిఒ : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పత్తికొండ, తుగ్గలి, మద్దికేర మండలాలున్నాయి. సొంత భవనాలు 97,అద్దె భవనాలు 90 ఉన్నాయి. మొత్తం 187 కేంద్రాలున్నాయి.

నాడు నేడు ద్వారా అంగన్వాడి సెంటర్లు ఎన్ని మంజూరయ్యాయి.ఎప్పటిలోపు పూర్తి చేస్తారు?

సిడిపిఒ: సెక్టార్ ప్రాజెక్టు పరిధిలోని పత్తికొండ 1, మద్దికేర2, తుగ్గలి 2 మొత్తం 5 మంజూరయ్యాయి. అక్టోబర్ 2 నాటికి పూర్తి చేసి , గాంధీ జయంతి రోజు ప్రారంభిస్తాం.

పత్తికొండ ఐసిడిసి కార్యాలయంలో ఎంతమంది సిబ్బంది ఉన్నారు? ఖాళీలెన్ని?

సిడిపిఒ: పత్తికొండ,తుగ్గలి, మద్దికేర ప్రాజెక్టుల సెక్టార్ పరిధిలోని సూపర్వైజర్లు 5 , జూనియర్ అసిస్టెంట్లు 2, సీనియర్ అసిస్టెంట్లు 1 అటెండర్ 1 బ్లాక్ కోఆర్డినేటర్ 1 , సూపర్వైజర్లు 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

గర్భిణీలకు, బాలింతలకు ఎలాంటి పౌష్టికాహారం అందజేస్తున్నారు?

సిడిపిఒ: అంగన్వాడి సెంటర్స్‌లో ప్రతిరోజు బాలింతలకు గర్భవతులకు వండిన అన్నం, కోడిగుడ్డు 200 మిల్లీలీటర్లపాలు అందిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ కిట్టుతో పాటు 3 కిలోల బియ్యం,1 కేజీ కందిపప్పు,1/2 పామాయిల్, 25 గుడ్లు ఇస్తున్నాం. ఆగస్టు 4 నుంచి ఇంటింటికి అందజేస్తాం.

అంగన్వాడి సెంటర్స్ లో పిల్లలకు ఎలాంటి పౌష్టికాహారం అందజేస్తున్నారు.

సిడిపిఒ: సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 9 గంటలకు 4 గంటల వరకు అంగన్వాడి కేంద్రాలు ప్రారంభమవుతాయి. ప్రతి రోజూ పిల్లలకు వండిన అన్నం, కోడిగుడ్డు 100మిల్లీలీటర్ల పాలు అందిస్తాం. 7 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలకు బాలామృతం 2.5, కోడిగుడ్లు 25 అందిస్తాం..

అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు ఏ ఏ పాటలు, ఆటలు ఆడిస్తారు..

సిడిపిఒ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. యాప్ ద్వారా పిల్లలకు కథలు, సంభాషణ, సృజనాత్మకత ,అభినయ గేయాలు పలు రకాల ఆటలు, పాటలు ఆడిస్తాం. విద్యాబుద్ధులు నేర్పిస్తాం..

మతోన్మాదుల పాలనకు చరమగీతం పాడాల్సిందే

-సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్
- మణిపూర్ ఘటనకు నిరసనగా జనకవనం

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

మతోన్మాదులు పాలిస్తున్న కేంద్రరాష్ట్రాల్లో సామాన్యలకు, బడుగు బలహీన, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ముఖ్యంగా ఆదివాసీలకు రక్షణలేకుండా పోయిందని, మతోన్మాదుల పాలనకు చరమగీతం పాడాలని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. కర్నూలు నగరంలో ఆదివారం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో మణిపూర్ మారణహోమంపై జనకవనం నిర్వహించారు. రాష్ట్రకార్యదర్శి జంధ్యాల రఘుబాబు సభాధ్యక్షతన జరిగిన సభలో ప్రధానవక్తగా కెంగారమోహన్ ప్రసంగించారు. దేశంలో హింసాకాండ సాగుతున్నదని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో అరాచకాలు అధికమయ్యాయని అన్నారు. సామాన్యులపై దాడులు అత్యాచారాలు అధికమై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారని అన్నారు. రక్షణ కల్పించాల్సిన పాలకులు మౌనం పాటిస్తున్నారని జాతుల మధ్యచిచ్చుపెట్టి రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం మనదేశంలో ప్రమాదంలో ఉందని లౌకికత్వాన్ని మతోన్మాదపాలకులు ఏనాడో హత్యచేశారన్నారు. మణిపూర్ దురాగతానికి కేంద్రప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. మణిపూర్ ఘటనలో సిగ్గుతో తలదించుకోవాల్సింది పాలకులేనన్నారు. ఇప్పటికైనా స్పందించి మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ ఈ అమానవీయ ఘటనతో మానవత్వమే తలదించుకుందని, ఈ తరహా అత్యాచారాలు దేశపురోగతికి ఆటంకమని, పాలకులు మౌనం పాటిస్తున్నారంటే వాళ్ళపాత్ర ఉందని స్పష్టమౌతుందన్నారు. మహిళలను రక్షించలేని ప్రభుత్వాలకు పాలించే అర్హత లేదన్నారు. ఈ అంశంపై త్వరలో కవితా సంకలనం తీసుకువస్తామని,ప్రగతిశీల కవులతో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. జనకవనంలో కవులు జి.వెంకట కృష్ణ, కవితావెంకటేశ్వర్లు, తెలుగు వెంకటేష్ , ఆవుల చక్రపాణి యాదవ్ , పులిచేరి మహేష్ , చౌశా, ముర్తుజా, విజయులు, నాగముని, ఇనాయతుల్లా, లక్ష్మణ్, విశ్వనాథరెడ్డి, పానుగంటి చంద్రయ్యలు కవితలు చదివారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా, విరసం నాయకులు నాగేశ్వరాచారి, సాహితీస్రవంతి నగర అధ్యక్షులు డి.అయ్యన్న సందేశం ఇచ్చారు. సభలో కథా రచయిత మారుతీ పౌరోహితం, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి మతోన్మాదం నశించాలని, మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని నిరసన తెలుపుతున్న కవులు

ఐక్య కార్మిక సంఘాల సదస్సులో మాట్లాడుతున్న పి. నిర్మల

9న మహాధర్నాను జయప్రదం చేయాలి

ఐక్య కార్మిక సంఘాల సదస్సులో నేతలు పిలుపు

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్

దేశ్ కి,బచావో సేవ్ ఇండియా అనే నిదానంతో కేంద్ర కార్మిక సంఘాలు ఆగస్టు 9న నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆదివారం కర్నూలు జిల్లా ఐక్య కార్మిక సంఘాల సదస్సు కర్నూలు ఎస్‌టియు భవన్‌లో నిర్వహించారు. ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి , ఐఎఫ్‌టియు, ఎఐయుటియుసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సిఐటియు జిల్లా నాయకురాలు పి. నిర్మల, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతకన్న, ఎఐయుటియుసి జిల్లా కార్యదర్శి ఎం. నాగన్న , ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, సురేష్ నాయక్‌లు ప్రసంగించారు. ఎస్.మునెప్ప మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాసిన బిజెపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దెదించాలని కోరారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగసంస్థలు రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు ,ఎల్ఐసి, చివరికి అంతరిక్ష పరిశోధన సంస్థలను కూడా ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేస్తున్నారన్నారు. మతం పేరుతో మారణ హోమం సృష్టిస్తున్నారన్నారు. పి.నిర్మల మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లుగా పనిచేస్తున్న ఆశ, అంగన్వాడి ,మధ్యాహ్న భోజనం 108 ,104 స్కీం వర్కర్లను గౌరవ వేతనం పేరుతో వారిశ్రమను దోచుకుంటున్నారని అన్నారు. వారిని గుర్తించి కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతుకమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మహిళల పైన ,గిరిజనుల పైన అత్యాచారాలు చేస్తుంటే చూస్తూ స్పందించడం లేదన్నారు. ఎఐయుటియుసి జిల్లా కార్యదర్శి ఎం. నాగన్న మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్ మాటాడుతూ అసంఘటితరంగ ఆటో, అంగన్వాడి ,హమాలి, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, చేనేత కార్మికులకు సామాజిక భద్రత సంక్షేమ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సురేష్ నాయక్ మాట్లాడారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె. అజయ్ బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు సభకు అధ్యక్షత వహించారు.ఆయా సంఘాల నాయకులు ఎన్. కృష్ణయ్య, వెంకటేష్ ,ఎన్ మనోహర్ మాణిక్యం, రాజు, రామాంజనేయులు, ఎం.రంగన్న, నెట్టికంటి, ఆర్.కష్టారెడ్డి, విజయ్ కుమార్ ,సాయిబాబా, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సదస్సు నిర్వాహకులు

ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్
జాతీయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

ఓటు హక్కు వినియోగం, రాజకీయ చైతన్యం కోసం ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాజకీయ వ్యవహారాలు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 రెండు రోజుల జాతీయ అవగాహన వర్క్‌షాపు ఆదివారం ప్రారంభమైంది. ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాజకీయ వ్యవహారాలు శాఖ వారి జాతీయ అవగాహన సదస్సు కర్నూలు నగరంలోని కోడుమూరు రోడ్ తాజ్ కన్వెన్షన్ లోని మౌలానా అబ్దుల్ ఖదీర్ అడ్వకేట్ రాష్ట్ర అధ్యక్షుని ఆధ్వర్యంలో అల్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు మౌలానా డాక్టర్ యాసీన్ అలీ ఉస్మాని న్యూ ఢిల్లీ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎపి ఉపముఖ్యమంత్రి అంజద్ బాషా, కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్, పెద్దలు ముఫతి షొయబ్ ఉల్లా ఖాన్ బెంగుళూరు, హజ్రత్ షా ఖాద్రి ముస్తఫా రిఫయి జిలాని, ముఫతి మహమ్మద్ అబ్దుల్ సత్తార్, రాష్ట్ర జిల్లాల ముఖ్య కార్యదర్శిలు, కర్నూలు జిల్లా కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈఏడాది తెలంగాణ, మధ్యప్రదేశ్ , మహారాష్ట్ర, ఝార్ఖండ్ , చత్తీస్గఢ్, రాజస్థాన్ 6 రాష్ట్రాల్లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ ఆరు రాష్ట్రాల అల్ ఇండియా మిల్లి కౌన్సిల్ రాజకీయ వ్యవహారాల శాఖ, ముఖ్య కార్యదర్శిలు అడ్వకేట్ ఉలమాలు పెద్దలు, మేధావులు, సోషల్ వర్కర్స్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాజకీయ పార్టీల అతీతంగా తెలుగు రాష్ట్రాల వివిధ పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజలకు చైతన్యం పరచడం, భవిష్యత్తులో రాబోయే కాలంలో తన ఓటు విలువను తెలియపరిచేందుకు , 18 ఏళ్ల నిండి ఉన్న వారందరికీ ఓటు నమోదు చేసుకోవడానికి , రాజకీయంగా చైతన్యపరిచేందుకని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రజాక్, అజ్జు, ముజహిద్, మోహిందిన, నాజాముద్దిన్, అబ్దుల్లా, షొయబ్, నూజెబ్ పాల్గొన్నారు.

ఉమెన్‌చాందికి కాంగ్రెస్ ఘన నివాళి

కోడుమూరు : కేరళ మాజీ ముఖ్యమంత్రి, ఎఐసిసి జనరల్ సెక్రటరీ ఉమెన్ చాందీకి కోడుమూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆదివారం సంతాపం తెలిపింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సంతాపసభలో కాగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు దామోదరం రాధాకృష్ణ మాట్లాడుతూ ఉమెన్ చాందీ మరణం కాంగ్రెస్ పార్టీకితీరని లోటని అన్నారు. వారి నిజాయితీ నిరాడంబరమైన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీలో నాకంటూ ఒక స్థానం వుందంటే అది ఉమెన్ చాందీ చలువేనని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పోతుల శేఖర్, జిల్లా సెక్రెటరీ రియాజుద్దీన్, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు జనార్దన్, కోఆర్డినేటర్ మెంబర్లు వసింబాష ,తిరుపాలు శ్రీనివాసులు, పాండురంగ, కర్నూల్ అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు మిన్నల్ల, హుస్సేన్ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

26న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 26న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఎపి ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రీజనల్ కార్యదర్శి సురేష్ బాబు కోరారు. రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను కర్నూలు ఎస్ఇ కార్యాలయం ఆవరణంలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ , స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కలిసి స్ట్రగుల్ కమిటీగా ఏర్పడి విద్యుత్ ఉద్యోగుల సమస్యల పైన ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని అన్నారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల కంటే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులు 30 శాతం జీతం తక్కువ పొందుతున్నారని తెలిపారు. తెలంగాణలో కాంట్రాక్టు స్కిల్ కార్మికులకు నెలకు రూ.40,132 ఇస్తుంటే ఆంధ్రప్రదేశ్లో మాత్రం కేవలం రూ.20,598 ఇస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన మాటలు నీటి మాటలుగా అయ్యాయని అన్నారు. సిఐటియు నాయకులు చలపతి, మోహన్, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివద్ధికి రూ.10వేల కోట్లు అవసరం

సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.పదివేల కోట్ల కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి టి రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 26 నుండి 31 వరకు జరుగుతున్న మహాపాదయాత్ర ను విజయవంతం చేయాలని కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 26,27,29,30 వార్డులలోని క్రిష్ణానగర్, అబ్బాస్ నగర్, వెంకటాద్రి నగర్, గుత్తి పెట్రోల్ బంక్, శారదా నగర్, పద్మావతి నగర్, శరీన్ నగర్, పార్వతీ నగర్, ఐటిసి సెంటర్లలో ఎం.లక్ష్మయ్య అధ్యక్షతన ప్రచారం నిర్వహించారు. టి. రాముడు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. సాయి బాబా మాట్లాడుతూ కర్నూలు జిల్లా వ్యవసాయ రంగంలో, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందకపోవడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. ఎన్నికల ముందు కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం అనేక వాగ్దానాలు చేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుఆచరణలో విస్మరించారని విమర్శించారు. కర్నూలు నగరంలో విలీనమైన కల్లూరు కాలనీలో 30 సంవత్సరాలు కావస్తున్న ఈరోజుకు ప్రతిరోజు తాగునీరు అందించలేకపోతున్నారని అన్నారు. రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 నుండి 31 వరకు నిర్వహించే మహాపాదయాత్రలలో ప్రజలం దరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం కార్యకర్తలు పి.మధు, సి.ఈశ్వర్, సి.చైతన్య,మాబాషా,ఎ.రవికుమార్, పి.వెంకటస్వామి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా

హెల్త్ సెక్రెటరీలు పోరాటాలకు సిద్ధం కావాలి

ఎపి యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ జి. సంధ్యారాణి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమస్యల పరిష్కారం కోసం హెల్త్ సెక్రటరీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ జి.సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్లో ఉభయ జిల్లాల జిల్లా కమిటీ సమావేశం మహేశ్వరమ్మ, డబ్ల్యుసి.గౌరీ అధ్యక్షతన జరిగింది. జి .సంధ్యారాణి, సంఘం గౌరవాధ్యక్షులు(సిఐటియు) పిఎస్. రాధాకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించిన విషయాలు ఎఎన్ఎంలు చేసే కార్యక్రమాలను గురించి వివరించారు. బయోమెట్రిక్ విధానాన్ని అధర్ ఆప్షన్‌లో ఇస్తామని చెప్పారన్నారు. గ్రేడ్ ఎఎన్ఎంలకు వర్తించే లీవ్‌లలో అన్ని వర్తిస్తాయని తెలిపారు. ఇంకా ఉభయ జిల్లాల్లో 24 మందికి ప్రొఫెషన్ డిక్లేర్ కాలేదని, ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే రోజు వినతిపత్రాన్ని ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. వారిని రెగ్యులర్ చేయకపోతే కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలకు కూర్చోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఎఎన్ఎం యాప్‌లపైన పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా ఎలాంటి స్పందన లేకపోవడంతో హెల్త్ సెక్రటరీలు విధులను బహిష్కరించి కలెక్టరేట్ ముందు ధర్నా చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. వార్డు,గ్రామ సచివాలయ హెల్త్ సెక్రటరీలు విధి నిర్వహణలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ (68/2021) విజ్ఞప్తి చేస్తున్నదని అన్నారు. అర్బన్,రూరల్ హెల్త్ సెక్రటరీలు క్షేత్రస్థాయి పనిచేసే ఉద్యోగులు కనుక విఆర్, సర్వేయర్లకు ఇచ్చిన మాదిరిగానే "అధర్ ఆప్షన్స్" లో ఎస్ఆర్ఎస్ వేసేట్లు ఆదేశాలివ్వాలిని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖలోని రెగ్యులర్ క్షేత్రస్థాయి సిబ్బందికి అమలవుతున్న విధంగా హెల్త్ సెక్రటరీలకు 35 క్యాజువల్ లీవ్‌లు, ఇతర లీవులు అమలు చెయ్యాలన్నారు. కర్నూలు జిల్లాలో ఎఎన్ఎం 3 గా పనిచేస్తున్న 24 మంది ప్రొబేషన్ ను ఇంకా డిక్లేర్ చేయలేదని, డిక్లేర్ చేసి వారి జీవితాల్లో వెలుగు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. అలా చేయని పక్షంలో పైన పేర్కొన్న విధంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఉభయ జిల్లాల గ్రామ వార్డు సచివాలయంలో పనిచేసే ఎఎన్ఎంలు పాల్గొన్నారు

మాట్లాడుతున్న జనరల్ సెక్రెటరీ జి. సంధ్యారాణి

మాట్లాడుతున్న జూనియర్ కళాశాలల ఎజిఎం మురళీకృష్ణ

శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ బిఎస్ రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్: ఆసియా ఖండంలోనే అతిపెద్ద విద్యాసంస్థ అయిన శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎస్‌రావు శ్రద్ధాంజలి కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాల శ్రీ చైతన్య విద్యాసంస్థల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది నగర ప్రముఖులు ఆదివారం ఘన నివాళులు అర్పించారు. ఈనెల 13న కన్ను మూసిన డాక్టర్ బిఎస్ రావు సంస్మరణార్థం కర్నూల్ ఎస్ఎల్ఎన్ గార్డెన్స్ లో నిర్వహించిన సంస్మరణ సభలో అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది శ్రీ చైతన్య శ్రేయోభిలాషులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అథితులు మాట్లాడుతూ బిఎస్.రావు అకుంఠిత దీక్ష ,పట్టుదల అంకితభావం సంస్థలోని సిబ్బంది అందరికీ మార్గదర్శకం కావాలన్నారు. భవిష్యత్తులో మరింతగా శ్రీ చైతన్య విద్యాసంస్థలు ఎదగాలని ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు ఆశించారు. కళాశాలల ఎజిఎం మురళీకృష్ణ, శ్రీ చైతన్య స్కూల్స్ ఎజిఎం సురేష్ బాబు , మైపర్ ఎండి ఆదిమూలపు సతీష్ ,కట్టమంచి జనార్దన్‌రెడ్డి, సోమిశెట్టి వెంకట రామయ్య ,టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ,విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.రెండు తెలుగు రాష్ట్రాలలో మెడికల్ ,ఇంజనీరింగ్ విభాగాలలో కొన్ని వేల ర్యాంకులు సాధిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థలు భవిష్యత్తులో మరింతగా విజయ పరంపరను కొనసాగించాలన్న ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల సిబ్బంది మాట్లాడుతూ డాక్టర్ బిఎస్.రావు భౌతికంగా తమ మధ్య లేకపోయినా ఎప్పటికీ తమ మనసుల్లో అమరులుగా మిగిలిపోతారని తెలిపారు.

మొహర్రంకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి తుగ్గలి

మండలం లోని తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామాలలో మొహర్రం పండుగకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున, జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న మొహరం వేడుకలకు గ్రామ పెద్దలు అనుమతి పొందితినే ఆ గ్రామాలలో మొహర్రం వేడుకలు జరుగుతాయని, అనుమతి లేకపోతే మొహర్రం పండుగలు నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలా గ్రామాలలో గ్రామ పెద్దలు వచ్చి అనుమతి తీసుకున్నారని తెలిపారు. అనుమతి లేకుండా మొహర్రం వేడుకలు జరిపితే, ఏమైనా జరిగితే ఆ గ్రామ పెద్దలే బాధ్యత వహించడం జరుగుతుందన్నారు. అందుకు ప్రతి గ్రామంలో మొహర్రం వేడుకలకు అనుమతి పొందాలని వారు కోరారు.

ఆదర్శ ప్రాయుడు శ్రీరాముడు

- శ్రీ మఠం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు
- 108 అడుగుల పంచలోహ విగ్రహ ఏర్పాటుకు వర్చువల్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- పాల్గొన్న మంత్రి గుమ్మనూరు, మాజీ ఎంపి టిజివి

శిలా ఫలక ఆవిష్కరణలో సుబుదేంద్రథీర్తులు, మంత్రి గుమ్మనూరు జయరాం, మాజీ ఎంపి టిజి వెంకటేశ్, తదితరులు

ప్రజాశక్తి - మంత్రాలయం

సమస్త మానవాళికి ఆదర్శ ప్రాయుడు శ్రీరాముడు అని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం మంత్రాలయంలోని ఎమ్మిగనూరు రహదారిలో ఏర్పాటు చేయనున్న 108 అడుగుల పంచలోహ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా వర్చువల్ విధానం ద్వారా శిలాఫలకం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సభలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, రాజ్యసభ ఎంపి టిజి వెంకటేశ్, బిజెపి నాయకులు హైకోర్టు న్యాయవాది పురుషోత్తం రెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై. ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు మాట్లాడుతూ రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన శ్రీరాముడు త్రేతాయుగంలో అరణ్య వాసం చేసిన సందర్భంగా మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం వద్ద ఉన్న బండ పై విశ్రమించారని తెలిపారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రవేశం చేసిన సమయంలో ఆ బండ రాయినే బృందావనానికి ఉపయోగించుకోవాలని శ్రీ రాఘవేంద్రస్వామి వారు చెప్పినట్లు చరిత్ర చెబుతోందన్నారు. శ్రీరాముని పంచలోహ విగ్రహం ఏర్పాటు వల్ల గొప్ప పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రంగా శ్రీమఠం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం వచ్చిన ప్రముఖులకు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు శ్రీ రాముని మెమొంటో అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఇంచార్జ్ విశ్వనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ భీమయ్య, నాయకులు లక్ష్మినారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల చిరకాల ఇంటి కల సాకారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

పేదల చిరకాల ఇంటి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చుతోందని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం ఇంద్ర నగర్ బండి మెట్ట ప్రాంతాలవాసులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని 17, 18 వార్డు బండి మెట్ట, ఇంద్ర నగర్ కాలనీలో 2009 కి ముందు స్థలానికి రూ.2100 డీడీల కట్టిన 122 లబ్ధిదారులకు పట్టాలు అందజేశామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలతోపాటు జగనన్న కాలనీలో 10 వేల పట్టాలు, 4700 టిడ్కో గృహాలు అందించామన్నారు. గతంలో 14 సంవత్సరాల చంద్రబాబు పేద ప్రజలకు ఒక సెంటు పట్టా భూమి ఇవ్వలేదన్నారు. మెడికల్ కాలేజ్, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, బైపాస్ రోడ్డు తదితర అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. త్వరలోనే బైపాస్ పనులు మొదలవుతాయని పట్టాలు పొందిన వారు అమ్ముకోకుండా అలాగే ఉంటే మంచి ధర వస్తుందని సూచించారు. పవన్ కళ్యాణ్ వాలంటరీ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయరాం రెడ్డి, విఆర్ఓ నయేమి, కౌన్సిలర్స్ చలపతి, చిన్న, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైఎస్ఆర్ సీనియర్ నాయకులు గోవిందు, రాజా, ఈరన్న, నారాయణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటి స్థలానికి పట్టాలు ఇచ్చిన ఎమ్మెల్యే

మణిపూర్ మారణ హోమానికి కేంద్రం బాధ్యత వహించాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత కొన్ని రోజులుగా ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమానికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మాత్యులు అమిత్ షాలు బాధ్యత వహించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు యస్. దేవ సహాయం పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట మణిపూర్‌లో మహిళల అత్యాచారం చేసిన వారిని శిక్షించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండున్నర నెలల నుండి కుకీ తెగ (క్రిస్టియన్లు) ప్రజల ప్రాణాలపై, మానాలపై, ఆవాసాలపై, ప్రార్థన స్థలాలపై మెయితీ హంతక మూకలు బహిరంగంగా సాగిస్తున్న హింస కాండకు మతోన్మాద పాలకులు అండగా ఉన్నారని ఆరోపించారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు కనకవీడు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి సుమాల అంతోనీ, నాయకులు సోగనూరు ఆనంద రావు, మాల నాగప్ప, కలుగొట్ల మాల రాజ రమేష్, కోటేకల్లు చిన్నప్ప, వెంకటాపురం గుంటెప్ప, సుమాల రాజు, కె. భాస్కర్, యం. రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అత్యాచారాలను వ్యతిరేకిస్తూ మాలమహానాడు జిల్లా అధ్యక్షడు మహానంది స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు హత్తి బెలగల్ ఈరన్న, లక్ష్మీనారాయణ, భరత్, నగరూరు చంద్ర, మల్లికార్జున, ఎర్రన్న, రాము, చాగి లింగప్ప, బాష, వీరేష్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న నాయకులు

నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

జలమయం చంద్రయ్య కొట్టాల

- సిపిఎం పాదయాత్రలో ప్రజలు వెల్లడి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని చంద్ర య్య కొట్టాల, కబరస్తాన్ వీధులు చిన్న పాటి వర్షాలకే జలమవుతు న్నాయని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వ హించిన పాదయా త్రలో ప్రజలు వెళ్లడిం చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, సిఐటియు నాయకులు బి రాముడు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో చివారి ప్రాంతమైన చంద్రయ్య కొట్టాల, కబ్రిస్తాన్ వీధి స్లమ్ ఏరియాలో రోజు కూలీగా పని చేస్తున్న వారు జీవిస్తున్నారని,. స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ రోడ్లు వేస్తామని అనేక వాగ్దానాలు చేసినా నేటి వరకు రోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. వీధులన్నీ జలమయమై చిన్న పిల్లలు ముసలి వాళ్లు ఇంటికే పరిమితమై ఉంటున్నారని, బయటికి రావాలంటేనే భయపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రోడ్లు వేయని పక్షంలో ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు అబ్దుల్లా, రమేష్, రాజు, రాముడు, శీను, రంగన్న, షంషేర్ బాష పాల్గొన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - ఆదోని

కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లో తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని నియోజకవర్గ ఇన్చార్జీ బోయ నీలకంఠప్ప, మండల అధ్యక్షుడు ఆది నారాయణ రెడ్డి అన్నారు.

ఆదివారం ఆదోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాహూల్ గాంధీ పాదయాత్రతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందన్నారు. దేశంలో మహిళలకు, దళితులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఏకతాటిపై నిలబెడుతూ రక్షించగలిగే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. ఈ సమావేశంలో ఆదోని పట్టణ కార్యనిర్వాహణ అధ్యక్షులు దిలీప్ దోక, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, యువజన నాయకుడు దేవిశెట్టి వీరేష్, ఐఎన్టీయుసి జయరాం, మనియార్ ఇర్ఫాన్, శ్రీనిత్, సుంకన్న, నిసార్ అహ్మద్, మాణిక్య రాజు, ఫారూఖ్ అహ్మద్, విరుపాపురం కాంగ్రెస్ నాయకులు మోహన్ రెడ్డి, నల్లారెడ్డి. బల్లేకల్లు కాంగ్రెస్ నాయకులు నరసయ్య, రాము, పెద్ద తుంబలం కాంగ్రెస్ నాయకులు బాష పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి - ఆదోని

ఆవోపా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదోని ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆదివారం జరిగిన ఉచిత మెగా ఆపరేషన్ల శిబిరానికి అపూర్వ స్పందన లభించిందని అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శి మిర్యాల శ్రీధర్ తెలిపారు. 350 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అపరేషన్లు అవసరమున్న150 మందిని నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌కు రెఫర్ చేశారన్నారు. శాంతిరాం జనరల్ హాస్పిటల్ నంద్యాల వారి సౌజన్యంతో జరుగుతున్న ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. మూడు శిబిరాలకు దాతగా నిలిచి దాతృత్వం చాటుకున్న కాకుబాల్ నగేష్‌కు అభినందనలు తెలుపుకుంటున్నామని అన్నారు. అంతకుముందు రాచోటి సుధాకర్, ఓజి నాగరాజు, డాక్టర్ సురేష్, కాళేపల్లి విశ్వనాథ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అవొపా సభ్యులు ఎక్కల రంగనా యకులు, రఘు, వై.వెంకటేశులు, విజయ కుమార్, ఓంకార్, రాంప్రసాద్, మురళి, అవొపా మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు బి సంగీత, వి మమతాశ్రీ, హిమబిందు, గీత, ముక్త, శోభ, సౌజన్య, లావణ్య, ప్రసన్న పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి : డిఇఒ

ప్రజాశక్తి - గోనెగండ్ల

బడిబయట ఉన్న బడిఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా బడిలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి రంగారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఎంఈఓలు, హెచ్ఎంలు, సిఆర్పిలతో సమావేశం నిర్వహించి మండలంలో విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ వాలంటీర్లు నిర్వహించిన సర్వే ప్రకారం మండలంలో పాఠశాలలకు వెళ్లకుండా బడి బయట ఉన్న 5 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలందరినీ ఆయా పాఠశాలల్లో చేర్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిఇఒ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న నాడు నేడు పనుల పురోగతిని పరిశీలించారు. పాఠశాలలో శిథిలావస్థకు చేరిన టాయిలెట్లను తొలగించి కొత్తవి నిర్మించాలని పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత లేకుం డా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలం లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యత లేకుండా మెనూ పాటించకుండా విద్యార్థులకు అందిస్తే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉన్నత పాఠశాలలోనూ మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రామాంజనేయులు, నీలకంఠ సిఆర్పిలు పాల్గొన్నారు.

జెడ్పి ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో

అనుమానంతో హత్య

- భార్యను చంపి పోలీసులకు లొంగిన భర్త

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని కిల్చినపేటలో దారుణం చోటుచేసుకుంది. భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందన అనుమానంతో భర్త భార్యను కడతేర్చిన ఘటన ఆదోని పట్టణంలో చోటు చేసుకుంది. ఆదోని వన్ టౌన్ సిఐ విక్రమ్ సింహ తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణంలోని కిల్చినపేట్‌కు చెందిన చంటికి ఐదేళ్ల క్రితం శిరీషతో వివాహం జరిగింది. చంటి భార్య శిరీష వివాహేత సంబంధం పెట్టుకుందని అనుమానం పడేవాడు. బంధువులు అనేక సార్లు భార్యభర్తలకు కౌన్సిలింగ్ చేశారు. ఆదివారం నాడు చంటి భార్య శిరీష(22) గొంతు నులిమి హత్య చేశానని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో లొంగి పోయాడని సిఐ వివరించారు. భార్యను హత్య చేసి భర్త పోలీసులకు లొంగిపోవడంపై పలువురు చర్చించుకున్నారు. ఈ మేరకు 1 టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల ఫైల్ ఫోటో

నేడు దేవనకొండకు మంత్రి గుమ్మనూరు రాక

ప్రజాశక్తి- దేవనకొండ

రాష్ట్ర ఉపాధి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోమవారం మండలంలోని జిల్లేడు బుడకల గ్రామానికి వస్తున్నట్లు మండల జడ్పిటిసి కిట్టు, ఎంపీపీ లక్ష్మీదేవి భర్త లుమంబా, వైసీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున ఆదివారం తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గ్రామస్తుల సమస్యలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

ఈనెల 26 నుండి 31 వరకు ఆదోని నుంచి నిర్వహించే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య కోరారు. ఆదివారం కౌతాళంలో సిపిఎం ఆధ్వర్యంలో జీపు జాత ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలంలో తాగు, సాగునీరు, తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవడానికి ఆదోని నుంచి కర్నూలు వరకు మహా పాదయాత్రను చేపట్టడం జరిగిందన్నారు. మ్యాలిగనూరు దగ్గర వరద కాలువ నిర్మిస్తే సస్యశ్యామలమై మండలం అభివృద్ధి అవుతుందని, వలసలు నివారించవచ్చు అన్నారు. సిపిఎం మండల కన్వీనర్ మేలిగిరి ఈరన్న, నాయకులు ఉల్లిగయ్య, వీరేష్, వెంకటేష్, మారయ్య, సత్యప్ప,వలి, వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

ఎమ్మిగనూరు నుండి కోసిగి వెళ్లే రహదారి గుంతల మాయంగా ఉంది నూతన నిర్మాణం చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి.డి.ఎస్.యు) జిల్లా కార్యదర్శి బి. మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పెద్దకడుభూరు మండలం పరిధిగల ఎమ్మిగనూరు టూ కోసిగి రోడ్డులో ఆర్.అండ్.బి అధికారుల దిష్టిబొమ్మను గుంతల రోడ్డులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహేంద్ర బాబు మాట్లాడుతూ చినుకు పడితే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉన్న ప్రభుత్వ అధికారలు మాత్రం రోడ్డు నిర్మాణాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారిని వేయాలని కోరారు. పిడిఎస్‌యు నాయకులు జనార్దన్, నరసింహ రెడ్డి, పాపన్న, అశోక్,ఇగ్బల్, వీరు, అల్లన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మొహర్రం జరుపుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - హాలహర్వి

మొహర్రం పండుగ ప్రశాంతమైన వాతావరణంలో చేసుకోవాలని ఎస్ఐ నాగేంద్ర అన్నారు. ఆదివారం విరుపాపురం,బిలేహాళ్, బోలుగోట గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి, ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా ఘర్షణలకు పాల్పడకుండా అన్నాదమ్ముల్లాగా కలిసిమెలిసి పండగ చేసుకోవాలన్నారు. ఎవరైనా గుట్కా,మట్కా ,కర్ణాటక మద్యం అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఉన్న పెద్దలు మొహర్రం పండుగకు అనుమతి కచ్చితంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఇంద్రుడు, కానిస్టేబుల్ గోవర్ధన్,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో పూజలు

ప్రజాశక్తి- హోళగుంద

దేవరగట్టులో భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిం చారు. కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ మాల మల్లేశ్వరలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆరు గంటల నుండి పూజ కోసం బార్లు తీరిన భక్తులకు అర్చకులు మల్లయ్య, మహేష్, స్వాములు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పుట్టినరోజు వేడుకలను వైసిపి నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాఘవేంద్ర సర్కిల్లో బాణా సంచా పేల్చి పిల్లల ద్వారా కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇంచార్జీ విశ్వనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ యంపిపి పులికుక్క రాఘవేంద్ర, యంపిటిసి జి. వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ గోర్కల్ కృష్ణస్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, నాయకులు శివకుమార్, జనార్దన్ రెడ్డి, వికెసి రఘు, చెట్నిహల్లి గ్రామ సర్పంచ్ అంజినయ్య, ఉప సర్పంచ్ వీరనాగప్ప, ఎంపిటిసి రామాంజనేయులు రాంపురం రెడ్డి సోదరుల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి రాజకీయాల్లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవలు అందించాలని నాయకులు ఆకాంక్షించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో పిఇటి నరసింహరాజు ఆధ్వర్యంలో సుమారు 5 వందల మొక్కలు నాటారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రజాశక్తి ప్రింటర్స్, పబ్లిషర్స్ ఆధ్వర్యంలో వెలువరించిన ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన ప్రత్యేక సంచికను వైసిపి నాయకులు ఆవిష్కరించారు. వైసిపి మండలాధ్యక్షులు నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, అభిమానులు ప్రజాశక్తి దినపత్రిక ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ ప్రచురించిన ప్రత్యేక సంచికను స్థానిక రాఘవేంద్ర సర్కిల్లో విడుదల చేశారు. కలర్‌ఫుల్‌గా ప్రచురితమైన ఈ ప్రత్యేక సంచికలో నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేసిన అభివృద్ధి పనులను వివరించడంతో పాటు రాజకీయంగా రాంపురం రెడ్డి సోదరులు చేస్తున్న సేవలను వివరించడంతో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

కోసిగి : మండలంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు గర్భిణీలకు పాలు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన్నగౌడ్,నాడిగేని నాగరాజు,మాజీ జడ్పిటిసి సభ్యురాలు మంగమ్మ, సీనియర్ నాయకులు మాణిక్యరాజు, చూడి బసి రెడ్డి, ప్రవీణ్ కుమార్,దొడ్డి నరసన్న ,నేల కోసిగి లక్ష్మయ్య,కాంట్రాక్టర్ నాగరాజు,వై.లక్ష్మణ, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కౌతాళం: వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్ దినకరన్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, ఉపసర్పంచ్ తిక్కయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు చౌదరి బసవరాజు, వడ్డే రాముడు, ఉమాపతి, వెంకోబా, ఈరన్న, హుసేని, అబ్దుల్ సమద్, రాజ అహ్మద్, భీమేష్, అమరాయ స్వామి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక సహకార సంఘం వద్ద వైఎస్ఆర్సిపి నాయకు... వేంద్ర రెడ్డి, ఆధ్వర్యంలో కేకను కట చసి ఎమ్మల్య జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరి, ఆనంద్ రాజు, ఉల్లిగప్ప తదితరులు పాల్గొన్నారు.

కోసిగి మండలంలో..

కౌతాళం మండలంలో..

ఘనంగా బషీర్ అహమ్మద్ వర్ధంతి

- వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని స్థానిక తేరుబజార్ వద్ద పట్టణానికి చెందిన మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ముస్లిం మైనారిటీ నాయకుడు కీర్తిశేషులు బషీర్ అహమ్మద్ తృతీయ వర్ధంతి వేడుకలను ఆయన కుటుంబ సభ్యులు బంధు మిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 200 మంది పేద మహిళలకు, వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన కుమారుడు మునిసిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ..బషీర్ అహమ్మద్ తన పదవి ద్వారా ప్రజలకు రాజకీయంగా ఒక ప్రజా ప్రతినిధిగా ఎనలేని సేవలు అందించారని వివరించారు. బషీర్ అహమ్మద్ మిత్రులు ప్రకాష్ జైన్, పక్కీర్ సాహెబ్, తెలుగురాముడులు మాట్లాడుతూ బషీర్ అహమ్మద్ జ్ఞాపకార్థంగా సొసైటీలో స్నేహ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని అక్కడికి చేరుకున్న వక్తలు ఆయన కుమారు లను కోరారు. ఈ కార్యక్రమంలో బషీర్ అహమ్మద్ కుమారుడు ఇర్ఫాన్, సోదరులు చాంద్ పీరా, మన్సూర్, మునీర్, రాజాచాంద్, మేనల్లుడు ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు వహాబ్, వెంకటేష్ ఆయన మిత్రులు తెలుగు రాముడు, ప్రకాష్ జైన్, అడ్వకేట్ మల్లికార్జున, ఇమామ్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.పి.నెం.69/2022

సజినేల జగదీష్. ...అర్జీదారు

-వర్సెస్-

పామిరెడ్డి వెంకటకొండరెడ్డి మరియు 9 మంది ఇతరులువగైరా. ...రెస్పాండెంట్లు

2,6,8 మరియు 9 రెస్పాండెంట్లకు నోటీసు

1. షేక్ అహమ్మద్‌బాష తండ్రి షేక్ అబ్దుల్‌ఖాదర్, ఫ్లాటు నెం.104.అమృత అపార్టుమెంటు, సంకల్‌బాగ్,కర్నూలుసిటి మరియు జిల్లా(ఆర్.2)
2. బి.ప్రశాంత్ తండ్రి బి.సి.బాలన్న, ఇంటి.నెం.49-50ఎ-56-3ఎ, శ్రీరాంనగర్,కర్నూలుసిటి మరియు జిల్లా(ఆర్.6)
3. పి.వెంకటలక్ష్మిదేవి భర్త లేటుపి.వెంకటేశ్వర్లు, ఇంటి.నెం.బి/బి.315,బి.క్యాంపు,శంకర్‌మందిర్ దగ్గర, కర్నూలుసిటి మరియు జిల్లా (ఆర్.8)
4. టి.క్రిష్ణమూర్తి తండ్రి టి.హుసేనయ్య, ఇంటి.నెం.87-1354-2బి, గౌతమినగర్, నంద్యాల చెక్‌పోస్టు, కర్నూలుసిటి మరియు జిల్లా (ఆర్.9)

పై నెంబరులో ఐ.పిలో అర్జీదారు తనను దివాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో ఐ.పి అర్జీ దాఖలు చేశారు. ఇందుపైన 2,6,8,9 రెస్పాండెంట్లకు కోర్టు నుండి పలుమార్లు నోటీసులు పంపినను మీకు చేరనందున కోర్టువారు మీకు ఈ పత్రిక ద్వారా నోటీసులు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 02-08-2023వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది:02-8-2023

సి. నాగమల్లేశ్వరరెడ్డి,
అర్జీదారు తరుపు న్యాయవాది, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.386/2022 ఇన్ ఓ.యస్.నెం.940/2022

నాగశేషులు వగైరా. ...అర్జీదారులు/వాదులు

-ఎదురి-

రవిశాస్త్రి వగైరా. ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

1వ రెస్పాండెంటుకు (ప్రతివాదికి) నోటీసులు

రవిశాస్త్రి తండ్రి లోకనాదమ్, వ్యాపారం, ప్లాటు నెం.31, అపూర్వవిల్లాస్, పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజి వెనుక ప్రక్క వెంకయపల్లె గ్రామం, కర్నూలు మండలం,కర్నూలు.

పై నెంబరు దావాలో అర్జీదారులు/వాదులు, రెస్పాండెంట్లు/ ప్రతివాదుల దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో రెస్పాండెంట్లు/ప్రతివాదుల గానీ, వారి తరపున మనుషులుగాని ప్రవేశించకుండా పర్మినెంటు ఇంజక్షన్ ఉత్తర్వు ఇప్పించమని కోరుతూ అర్జీదాఖాలు చేస్తూ, యాడ్ ఇంటరిమ్ ఇంజన్‌క్షన్ ఉత్తర్వు ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినారు. కావున ఇందులో 1వ రెస్పాండెంటుకు అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 31-08-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ/దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడ మైనది.

షెడ్యూలు: కర్నూలు జిల్లా కర్నూలు మండలం, రుద్రవరం మజార, పడిదెంపాడు గ్రామం, సర్వే.నెం.608/బి, యకరం.1.00సెంట్లు.
తూర్పు : కురువ జామ్మన్న మరియు వెంగన్న భూమి.
పడమర : కురువ పెద్దనాగన్న భూమి
ఉత్తరం : రత్నమయ్య భూమి.
దక్షిణం : చిన్నరంగన్న భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 31-08-2023

యు.సత్యపాల్‌రెడ్డి,
జి.పి.శ్యామ్‌సుందర్,
యం. శ్రీనివాసనాయక్,
వై.మోహన్‌రాజు,
వాదుల పరం న్యాయవాదులు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.940/2022

నాగశేషులు వగైరా. ...వాదులు

-వర్సెస్-

రవిశాస్త్రి వగైరా. ...ప్రతివాదులు

1వ ప్రతివాదికి దావా సమన్లు

రవిశాస్త్రి తండ్రి లోకనాదమ్, వ్యాపారం, ప్లాటు నెం.31, అపూర్వవిల్లాస్, పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజి వెనుక ప్రక్క వెంకయపల్లె గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు.

పై నెంబరు దావాలో వాదులు, ప్రతివాదుల దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో ప్రతివాదులు గానీ, వారి తరపున మనుషులుగాని ప్రవేశించకుండా పర్మినెంటు ఇంజక్షన్ ఉత్తర్వు ఇప్పించమని వాది హక్కును భంగం కలిగించకుండా ఉండులాగున మరియు దావా ఖర్చులు రాగోరి వాదులు ప్రతివాదులపైన దావా దాఖలు చేసినారు. కావున ఇందులో 1వ ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 31-08-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: కర్నూలు జిల్లా కర్నూలు మండలం, రుద్రవరం మజార, పడిదెంపాడు గ్రామం, సర్వే.నెం.608/బి,యకరం.1.00సెంట్లు.
తూర్పు : కురువ జామ్మన్న మరియు వెంగన్న భూమి.
పడమర : కురువ పెద్దనాగన్న భూమి
ఉత్తరం : రత్నమయ్య భూమి.
దక్షిణం : చిన్నరంగన్న భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 31-08-2023

యు.సత్యపాల్‌రెడ్డి,
జి.పి.శ్యామ్‌సుందర్,
యం. శ్రీనివాసనాయక్,
వై.మోహన్‌రాజు,
వాదుల పరం న్యాయవాదులు, కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ. యస్.నెం.217/2023

కె.రవి ప్రసాద్. ...వాది

- ఎదురి -

అత్తులూరి విజయ్ కుమార్ తండ్రి రామస్వామి, వయస్సు 40 సంవత్సరాలు, హిందు, వ్యాపారము, ఇంటి. నెంబర్.56/10యఫ్, కొండయ్య గేటు, కర్నూలు. ...మొదటి ప్రతివాది

మొదటి ప్రతి వాదికి దావా సమన్లు

వాది పై దావా మీపై దాఖలు చేసి ఉన్నాడు. మీరు రాసి ఇచ్చిన దాన దస్తావేజును రద్దు పరచవలసిందిగా కోరుతూ మీపై దావా వేసి ఉన్నాడు. ఇందులో మొదటి ప్రతివాది అయిన మీకు ఎలాంటి ఆక్షేపణ ఉన్నచో పై కోర్టు ఎదుట 22-08- 2023వ తేదీ ఉదయం 10:00 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున పై దావాని విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 22-8-2023

టి.ఈశ్వర్ బాబు
వాది పరం న్యాయవాది, కర్నూలు.



సాగుపై ఆశలు

- ఇప్పటికీ లోటు వర్షపాతమే
- వర్షాలు పడుతుండటంతో రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వంటల సాగుపై రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటి వరకూ లోటు వర్షపాతమే నమోదైనా వర్షాలు కురుస్తుండటంతో సాగు చేసేందుకు రైతులు ఇంకా ఎదురుచూస్తున్నారు...

తొలకరి వర్షం పడి నెల రోజులు గడిచినా వర్షాలు లేకపోవడంతో మొన్నటి వరకూ పంటల సాగు మీద రైతులు ఆశలు వదిలేసుకున్నారు. తాజాగా వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పంటల సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ లోటు వర్షపాతమే నమోదైంది. జులై నెల సాధారణ వర్షపాతం 141.2 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకూ 81.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకూ 43 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. ఈ నెలలో ఇప్పటి వరకూ జిల్లాలోని 29 మండలాల్లో 4 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతానికి మించి వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాధారణ సాగులో కేవలం 7 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 5,93,482.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 41,596 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు ఆశించిన రీతిలో పడకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే వరి సాధారణ సాగు 1,76,315 ఎకరాలు కాగా కేవలం 507.5 ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకూ సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు 1,04,745 ఎకరాలు కాగా 10,485 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. కంది సాధారణ సాగు 93,877.5 ఎకరాలు కాగా 9,135 ఎకరాల్లో, మినుము సాధారణ సాగు 16,982.5 ఎకరాలు కాగా 2710 ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు 39,510 ఎకరాలు కాగా 3,442.5 ఎకరాల్లో, ఆముదం సాధారణ సాగు 7,455 ఎకరాలు కాగా 4,442.5 ఎకరాల్లో సాగయ్యాయి. సోయాబీన్ సాధారణ సాగు 5,737.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా కేవలం 97.5 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 63,965 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 3,715 ఎకరాల్లో సాగైంది. ఉల్లి సాధారణ సాగు 10,182.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 197.5 ఎకరాల్లో సాగు చేశారు.

జిల్లాలో మిరప సాధారణ సాగు విస్తీర్ణం 25,010 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ కేవలం 515 ఎకరాల్లో సాగైంది. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూటగట్టుకోవడంతో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పసుపు సాధారణ సాగు 2,737.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 130 ఎకరాల్లో, టమోటా సాధారణ సాగు 4,590 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1,257.5 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇతర పంటల సాగు విస్తీర్ణం 17,347.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1,745 ఎకరాల్లో సాగయ్యాయి. వరుసగా కురుస్తున్న వర్షానికి మళ్లీ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

శ్రీశైలానికి వరద ప్రవాహం

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాలు మహారాష్ట్ర, కర్ణాటకలలో కురుస్తున్న భారీ వర్షాల వలన శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం మొదలైంది. ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదనతో 37,930 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. అదే సమయానికి జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 809.10 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిఎంసిలకు గాను ప్రస్తుతం 33.7658 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం డ్యాంలో నీటి నిలువ డెడ్ స్టోరేజీకి పడిపోవడంతో కుడి, ఎడమ జల విద్యుత్తు కేంద్రాలలో గత కొంత కాలంగా విద్యుత్ ఉత్పత్తి నిలిపి వేశారు. నీటి నిలువ సామర్థ్యం పెరిగాక ప్రారంభించే అవకాశం ఉంది. గతేడాది జులై 20 నాటికి శ్రీశైలం డ్యాంలో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉండటంతో గేట్లు తెరిచి దిగువకు నీటిని వదిలారు. ఈసారి ఇంకా డెడ్ స్టోరేజీలోనే ఉంది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని వ్యాపారులు, రియల్ ఎస్టేట్, ఐటీ ప్రొఫెషనల్స్‌ను టార్గెట్ చేస్తూ వాట్సప్ గ్రూప్ లింక్స్ పంపించి బిట్ కాయిన్స్, క్రిప్టో కరెన్సీ పేరిట ఇన్వెస్ట్ చేయించి చివరకు వాటిని కాజేసే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె.రఘు వీర్ రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇస్తామంటూ ప్రజలను ఆకర్షించి కోట్లలో దోచేస్తున్నారని తెలిపారు. వర్చువల్ అకౌంట్స్‌తో మాయ చేస్తూ రూ.లక్షల్లో నకిలీ సైట్‌లో ఇన్వెస్ట్ చేయించి మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వాట్సాప్‌లో నకిలీ లింక్స్ పంపించి ముందుగా ఓపెన్ చేయిస్తారని, అప్పటికే గ్రూపులోని మెంబర్స్‌తో చాటింగ్‌లో ఉంటారని, క్రియేట్ చేసిన బిట్ కాయిన్ వెబ్ సైట్‌లో ఇన్వెస్ట్ చేయాలని సూచిస్తారని, చాలా మంది ఇన్వెస్ట్ చేసినట్లు ఫేక్ ఆన్లైన్ పేమెంట్స్ స్క్రీన్ షార్ట్స్ పోస్ట్ చేస్తుంటారని తెలిపారు. ఇన్వెస్ట్మెంట్‌కి రెండు మూడు రోజుల్లోనే సుమారు 10 శాతం లాభాలు వచ్చినట్లు నమ్మిస్తారన్నారు. నమ్మి ఇన్వెస్ట్ చేసిన డబ్బును వర్చువల్ అకౌంట్స్ బ్యాలెన్స్ చూపిస్తారని, ఇన్వెస్ట్‌మెంట్ చేసిన డబ్బు, లాభాలు విత్ డ్రా చేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వకుండా జాగ్రత్తలు పడుతుంటారని, ఇలా వేలల్లో ఇన్వెస్ట్ చేయించి చివరకు కొట్టేస్తారన్నారు. ఎవరైనా ఈ విధంగా మోసపోతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు, నంద్యాల సైబర్ క్రైమ్ నంబర్ 91549 87034కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నిందితులను ఉరి తీయాలి

- సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనాన్ని యత్నం
- అడ్డుకున్న పోలీసులు - నాయకులు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - ఆత్మకూర్

మణిపూర్‌లో అత్యంత అటవిక చర్యకు పాల్పడిన నిందితులను తక్షణమే ఉరి తీయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో మణిపూర్‌లో అల్లర్లకు నిరసనగా సిపిఐ తాలూకా సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు నాయకులను స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ మణిపూర్‌లో నిందితులను కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పకుండా సుప్రీంకోర్టు తక్షణమే న్యాయ విచారణ జరిపి ఉరి తీయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధితులకు న్యాయం జరిగే వరకూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లాసహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకష్ణ కే శ్రీనివాసులు, తాలూకా నాయకులు ప్రసాదు, ప్రతాప్, వెంకట శివుడు, మహిళా సంఘం నాయకురాలు స్వాతి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, దినేష్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కర్నూల్-గుంటూరు రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

కార్మిక చట్టాల అమలుకు ఐక్య ఉద్యమం

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కార్మిక చట్టాల అమలు కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా నిర్మాణ వర్క్‌షాప్ రెండవ రోజు ఆదివారం జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం అధ్యక్షతన కొనసాగింది. ఈ సందర్భంగా కె.ధనలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒకవైపు పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీ రుణాలు ఇవ్వడం, మరుసటి సంవత్సరమే ఆ రుణాలను రద్దు చేస్తూ, మరోవైపు ఆ భారాలను సామాన్యులపై మోపుతుందని విమర్శించారు. ప్రభుత్వ విధానాల వల్లే దేశ చరిత్రలో ఎన్నడు లేని విధంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయని చెప్పారు. వైద్య, విద్య రంగాల ప్రైవేటీకరణను వేగవంతం చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు పోరాటం చేస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వల్ల అందులో పనిచేసే లక్షలాదిమంది కార్మికులు, ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితిని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. మణిపూర్‌లో జాతుల తగాదాతో జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. అక్కడ ఉన్న కార్మికులు, ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్న పరిస్థితి ఉందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. 44 కార్మిక చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడలను తీసుకొచ్చి కోట్లాది మంది కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి వాగ్దానం చేసి అధికారంలో వచ్చిన తర్వాత ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న వాటిని తీసివేస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోస్తుందన్నారు. స్కీం వర్కర్లకు ఆశ, అంగన్వాడీ, వివోఏ, విఆర్‌ఏ, స్వచ్ఛభారత్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 25 వేలు ఇవ్వాలని, హమాలీ, ఆటో, భవన నిర్మాణ హమాలీ, కార్మికులకు సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఆటో, భవన నిర్మాణ కార్మికులు, మహిళలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీ లేని పోరాటాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట ముద్దులు, భాస్కర్ రెడ్డి, ఎల్లయ్య, కెఎండి.గౌస్, సుబ్బయ్య, జిల్లా సహాయ కార్యదర్శిలు వి.బాలవెంకట్, శివరాం, నాగమణి, వెంకట లింగం, గురుస్వామి, జిల్లా కోశాధికారి తిరుపతయ్య, జిల్లా నాయకులు రత్నమయ్య, మారెన్న, హరిత, యాకోబు, భాస్కరాచారి, భాస్కర్, భూపాల్, ఎస్‌కె బాషా, మండల అధ్యక్ష కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా కార్యదర్శులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రభుత్వ ఆసుపత్రిలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న జాన ప్రభాకర్

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్ ఆదివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా పోరిమామిళ్ళకి చెందిన దేవాదినం పుట్టినరోజు సందర్భంగా ఆయన సతీమణి ప్రేమకుమారి, కుమారుడు దినేష్, కుమార్తె సోనీల ఆర్థిక సహాయంతో గర్భిణులకు, బాలింతలకు రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేసినట్లు తెలిపారు. వారికి ఈ పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు అందిస్తున్న సహాయం ద్వారా మంచి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

రోటరీ ఆరోగ్య వేదిక సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రోటరీ ఆరోగ్య వేదిక సేవలు అభినందనీయమని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. ఆదివారం పట్టణంలోని రోటరీ ఆరోగ్య వేదిక వద్ద జోష్ ఆళ్లగడ్డ–హ్యాపీ సండే కార్యక్రమాలను రోటరీ ఆరోగ్య వేదిక వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటరీ ఆరోగ్య వేదిక తరపున చేస్తున్న ఆరోగ్య ప్రచారం పట్ల వ్యవస్థాపకులు డాక్టర్ రాంగోపాల్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. యోగా ప్రాణాయామం, క్రీడల వల్ల మానసిక ఉల్లాసం వికాసం కలుగుతుందని పేర్కొన్నారు. డైనమిక్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ డాక్టర్ ప్రసాద్ లాఫింగ్ థెరపీ వల్ల కలిగే ప్రయోజనాలను ఆరోగ్య వేదిక సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా హైదరాబాదులో బిజినెస్ మేనేజ్మెంట్ విద్యను అభ్యసిస్తున్న తన్వి జుంబా డాన్స్ ప్రదర్శన అందర్నీ ఎంతో ఆకట్టుకుంది. జుంబా డాన్స్ ప్రాక్టీస్ వల్ల శరీరంలోని అన్ని భాగాలలో చైతన్యం కలిగి ఆరోగ్యం చేకూరుతుందని ఆరోగ్య నిపుణులు తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ సుజాతను రోటరీ ఆరోగ్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, సభ్యులందరూ జ్ఞాపిక ఇచ్చి ఘనంగా సత్కరించారు.

అంటురోగాల నుండి కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

వర్షాకాలం ప్రారంభం కావడంతో పట్టణంలోని 24 వార్డులలోని ప్రజలను అంటురోగాలు, విష జ్వరాల బారి నుంచి కాపాడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, పట్టణ నాయకులు ఎన్.స్వాములు, ఏ.సురేంద్ర, జి.నాగేశ్వరరావులు సంబంధిత అధికారులను కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ లేక చిన్నపాటి వర్షాలకే రోడ్లు చెరువులను తలపిస్తూ దోమలు వ్యాప్తి చెంది ప్రజలపై దాడి చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు రోగాల బారిన పడి వైద్యానికి వేల రూపాయలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజలపై పన్నుల భారాలు మోపి ముక్కు పిండి వసూలు చేయడానికి చూపే శ్రద్ధ ఏదైనా సమస్య పరిష్కారం చేయమంటే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చేస్తామని చెప్పే అధికారులు, ప్రజాప్రతినిధులకు వర్షాకాలంలో ప్రజలు పడే ఇబ్బందులు కనపడవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లపై నీరు ఆగకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా పట్టణంలోని 24 వార్డులలో ప్రతిరోజు ఫాగింగ్ చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆయా కాలనీలో ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అభాగ్యుల పాలిట ఆపద్బాంధవుడు డాక్టర్ గంగన్న

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అభాగ్యులకు నేనున్నానంటూ ఆపన్న హస్తం అందిస్తూ మానవత్వం చాటుకుంటున్నాడు డాక్టర్ గంగన్న. ఆళ్లగడ్డకు చెందిన గంగన్న పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లో ఉన్న అభాగ్యులకు ఆపన్న హస్తం అందిస్తున్నాడు. 1995 నుంచి అనేకమందికి ఆపన్న హస్తం అందిస్తూ తనకున్నంతలో నెల నెలా కొంత మొత్తాన్ని అభాగ్యులకు పెన్షన్ రూపంలో అందిస్తున్నాడు. అలాగే పేద విద్యార్థులకు ఫీజు డబ్బులు ఇవ్వడం, పుస్తకాలు కొనిస్తున్నారు. దీనికి తోడు సేవలో భాగంగా ఆళ్లగడ్డ లయన్స్ క్లబ్‌లో ఉపాధ్యక్షుడుగా ఉంటూ గత 614 రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రిలో దాతల సహాయంతో పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఓబులంపల్లి గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ బీ భర్త 20 సంవత్సరాల క్రితం, 10 సంవత్సరాల క్రితం కూతురు చనిపోవడంతో అనాథగా మిగిలింది. ఆమె ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న గంగన్న నెలకు వెయ్యి రూపాయలను పెన్షన్ మాదిరిగా గత ఆరు సంవత్సరాలుగా అందిస్తూ సాయం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఓబులంపల్లి గ్రామంలోని బంధువుల వద్ద ఉంటుంది. ఈ సందర్భంగా గంగన్న మాట్లాడుతూ తన జీవితాంతం సమాజ సేవ చేస్తూనే ఉంటానని, షేక్ హుస్సేన్ బీకి ప్రతి నెలా 1000 రూపాయలు ఇస్తానని వివరించారు. హుస్సేన్ బీకి ప్రభుత్వ పెన్షన్ రావడం లేదని, తాను పెన్షన్ కోసం అన్ని ప్రయత్నాలు చేశానన్నారు. ప్రభుత్వం కూడా స్పందించి పెన్షన్ ఇవ్వాలన్నారు. పేదలకు, అభాగ్యులకు ప్రతి ఒక్కరూ మానవత్వంతో తమకు ఉన్నంతలో సాయం అందించాలని దాతలను కోరారు.

హుస్సేన్ బీ కి రూ.1000 అందిస్తున్న డాక్టర్ గంగన్న

విద్యార్థినీలకు దుస్తులను అందిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-డోన్

విద్యతోనే విద్యార్థినులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కె.షాలిని ప్రకాష్ అన్నారు. ఆదివారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో డోన్‌లోని అయ్యప్ప స్వామి గుడి దగ్గర ఉన్న మహాత్మ జ్యోతి బాపూలే బాలికల బిసి గురుకుల పాఠశాలలో 20 మంది విద్యార్థినులకు ఎం.జగన్మోహన్, ఎం.శారదాదేవిల మనవరాలు జాయ్ పుట్టినరోజు సందర్భంగా రెండు జతల చొప్పున దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కె.షాలిని ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థినులు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు అధిరోహించాలన్నారు. సహాయం పొందిన వారు భవిష్యత్తులో మంచి స్థానంలో ఉంటే తప్పకుండా వారు కూడా పదిమందికి సహాయం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థినులకు జాయ్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులందరికీ చాక్లెట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా చైర్మన్ సప్తశైల సుమిత్రా రాజేష్, ఇన్నర్ వీల్ క్లబ్ ఫౌండర్ రాజాసుజాత, మాజీ అధ్యక్షురాలు మర్రి సరళ దేవి, సభ్యులు మద్దమ్మ, లీలావతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణల పేరుతో పల్లె బడులకు మంగళం

- ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పాఠశాలల్లో సంస్కరణల పేరుతో పల్లెబడులకు రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడుతోందని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం నంద్యాలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు అజాం బేగ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య సంస్కరణలలో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వులు 117 ప్రకారం ఒక కోలోమీటర్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను సమీపంలోని ఉన్నత పాఠశాలలో విలీనం చేసి, ఆ సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులను కేటాయించలేదన్నారు. మిగిలిన ఉపాధ్యాయులు కూడా ప్రాథమిక పాఠశాలలో 1, 2 తరగతులకు ఉంటారో ఉండరో అనే అయోమయంలో తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలో చేర్పించుటకు సంశయిస్తున్నారని చెప్పారు. అలాగే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి ఆ బడులను రద్దు చేయడం, ఆశాస్త్రీయ విధానాలతో పని సర్దుబాటు వంటి చర్యలు చేపట్టడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గతంతో పోల్చుకుంటే గణనీయంగా తగ్గిన మాట వాస్తవమన్నారు. విరమణ, స్వచ్ఛంద విరమణ ద్వారా ఏర్పడిన ఖాళీలను గత నాలుగు సంవత్సరాలుగా భర్తీ చేయకపోవడం కూడా ప్రభ్యత్వ పాఠశాలల బలహీనానికి మరొక కారణన్నారు. ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు చేసినా తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించకపోతే గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు మూత పడే అవకాశం లేక పోలేదన్నారు. తక్షణం ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించి ఉపాధ్యాయుల కొరత తీర్చాలన్నారు. రాష్ట్ర సహధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గోపాలకష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఇగ్బాల్ భాషా మాట్లాడారు. ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట రామిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు ప్రసాదు, సాంకేతిక కమిటెడ్ కన్వీనర్ నాగేంద్ర, రిటైర్డ్ ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్

కాలువల్లో చెత్త వేయరాదు : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

డ్రెయినేజీ కాలువలలో బాటిల్స్, చెత్త చెదారం వేయొద్దని స్థానిక ప్రజలకు నంద్యాల మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రా రెడ్డి సూచించారు. గత రెండు రోజులుగా వర్షాలు పడుతుందటంతో డ్రెయినేజీపై శానిటేషన్ సిబ్బందితో కలిసి ఆదివారం పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ పర్యటించారు. సంజీవ నగర్ గేట్, మెయిన్ రోడ్లు రామాలయం టెంపుల్ బ్యాక్ సైడ్ నందు వర్షాకాలంలో డ్రెయిన్ వాటర్ రోడ్లపై రాకుండా, డ్రెయిన్స్‌లో చెత్త వేయకుండా పరిసర జనాలకు అవగాహన కల్పించారు. డ్రెయిన్ క్లీనింగ్ శానిటేషన్ పనులను పరిశీలించారు.

డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న అవోపా సెక్రటరీ జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి

నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలో 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న 26 మంది ఆర్యవైశ్య పేద విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం పాతపేటలోని అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశంలో ఆర్థికసాయం రూ. 1 లక్ష 7 వేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ కొ్ట్రికె. హరికిషన్, సెక్రెటరీ పువ్వాడి వెంకటరంగయ్య, ట్రెజరర్ చాటకొండ వెంకటేశ్వర్లు, అవోపా ప్రెసిడెంట్ మాకం కృష్ణ కిషోర్, సెక్రటరీ జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి, కోశాధికారి శేగుసుదర్శన్ రావులు మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థులకు చదువు నిమిత్తం రూ. 1 లక్ష 7 వేలు పంపిణీ చేసినట్లు చెప్పారు. దాతలు ఎంతో సంతోషము గా ముందుకు వచ్చి వచ్చే సంవత్సరానికి కూడా ప్రస్తుతం అవోపా తరుపున ఇస్తున్న 50 వేలకు గాను దాతలు ముందుకు రావడంతో 1,10,000 రూపాయలను అవోపా తరుపున ఇవ్వడానికి అవకాశం ఏర్పడిందని అన్నారు. దాతలు ఇచ్చిన ప్రతి రూపాయిని అవోపా సద్వినియోగం చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అవోపా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ శివపురం నాగరాజు, అవోపా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దుర్గం అంబికేశ్వర శెట్టి కర్నూలు జిల్లా జాయింట్ సెక్రెటరీ కొప్పరి కృష్ణమూర్తి ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఈర్లదిన్నె శ్రీధర్ రాజా రాజశేఖర్ కొండా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండే కాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకున్నారు. తెల్లవారుజామున 4-30 గంటల నుండి స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిని ఇచ్చారు. భక్తులు అడిగినన్ని ఇచ్చేందుకు లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉంచినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిగా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు దేవస్థానం అధికారులు పర్యవేక్షించారు. క్షేత్ర పరిధిలో కమ్యూనిటీ సత్రాలు, దేవస్థానం గదులు, కాటేజీలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఇంకా అనేకమంది భక్తులు గదులు దొరకగా ఇబ్బందులు పడ్డారు.

దారులు.. దారుణం

- గుంతల్లో కుంటలను తలపిస్తూ నిలిచిన నీరు
- డ్రెయినేజీ లేక అవస్థలు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- దృష్టి సారించని అధికారులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండల కేంద్రంలోని ఆత్మకూరు-సంగమేశ్వరం వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంతో అధ్వానంగా మారింది. రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచి కుంటలను తలపిస్తోంది. వాహనదారులకు ప్రమాదాలతో పాటు స్థానిక ప్రజలకు రోగాలకు నిలయంగా మారింది. వర్షపు నీరు వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకపోవడంతో రోజుల తరబడి నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడక్కడ గుంతలు ఉండడంతో నిలిచిన నీటిలో ద్విచక్ర, ఆటో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల కేంద్రంలో అన్ని శాఖల కార్యాలయాలు, అధికారులు న్నప్పటికీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. పాలకులు, అధికారులు గ్రామ స్వరాజ్యాన్ని గాలికొదిలేశారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రధాన రహదారులు కొద్దిపాటి వర్షం వస్తే చాలు కుంటలను తలపిస్తున్నాయి.

కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు, దాదాపు 18 వరకు మజరా గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా ప్రతిరోజు పట్టణ ప్రాంతాలకు కొత్తపల్లి మండల కేంద్రం మీదుగా వెళ్తుంటారు. అలాగే విద్యార్థులు కూడా వెళ్తుంటారు. నందికుంట మొదలుకుని బావాపురం, కొత్తపల్లి మీదుగా లింగాపురం, శివపురం తదితర గ్రామాల్లో రహదారుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. అలాగే ఆత్మకూరు నుంచి జెడ్డువారిపల్లెకు వెళ్లే రహదారిలోని దుద్యాల గ్రామంలో కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రత్యేకించి కొత్తపల్లి, లింగాపురం, శివపురం గ్రామాల్లో రహదారులు మరీ అధ్వానంగా మారాయి. విద్యార్థులు, ప్రజలు ఈ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండి కుంటలను తలపిస్తున్నాయి. వాటి పక్కనే నివాసాలున్నాయి. ఎక్కడా కూడా డ్రెయినేజీ వ్యవస్థలు లేవు. దీంతో వాటి నుంచి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాధుడే లేకపోవడం దురదృష్టకరం. అక్కడక్కడ డ్రెయినేజీ వ్యవస్థ ఉన్నప్పటికీ అక్కడక్కడ మట్టితో పూడుకుపోయిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక వర్షాలు అధికమైతే పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు డ్రెయినేజీలు ఏర్పాటు చేసి నీరు ప్రధాన రహదారిపై నిలబడకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గుంతలమయమైన రహదారులు

ఆత్మకూరు వెళ్లాలంటే నరకయాతన

పనుల నిమిత్తం ఆత్మకూరు వెళ్లాలంటే రహదారులు మురికి నీటితో నిండి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అక్కడక్కడ గుంతలు ఉన్న రోడ్లపై నరకయాతనే. ప్రతి రోజూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు, వాహనదారులు మురికి కాలువలను దాటుకుంటా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్ల మీదే వెళ్తున్నారు. కానీ ఎవరు కూడా సమస్యపై స్పందించడం లేదు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలి.

- బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, పెద్ద గుమ్మడాపురం.

నేడు నిరసన దీక్షను జయప్రదం చేయండి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నంద్యాల జిల్లా సెంటర్లో నేడు సోమవారం జరిగే నిరసన దీక్షలో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు అరిఫ్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు అందజేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నేడు 8 గంటల నిరసన దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. జూనియర్ కళాశాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఉద్యమిస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరిని మానుకొని పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇమ్రాన్ ,ఆసిఫ్, రవి ,అభి రాజుతదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పేదలు ఆరోగ్యంగా జీవించాలి : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూరు

పేద ప్రజలు ఆరోగ్యంగా జీవించి, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నదే శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తపన అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణుకా ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయ ప్రాంగణంలో స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా అధ్వర్యంలో తెలుగునాడు విద్యార్థి నాయకులు షేక్.ఫరూక్, సయ్యద్, మునీర్‌తో కలిసి కర్నూల్ వోమ్ని హాస్పిటల్ వైద్యులచే ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రముఖ సిటీ సర్జన్ ప్రవీణ్ కుమార్, జనరల్ సర్జన్ అఖిల్ రానా, అఖిల్ కుమార్‌లు క్యాంప్‌లో పాల్గొనిగుండెకి సంబందించిన ఈసీజీ, 2డి, కడుపు నొప్పి, థైరాయిడ్, అపెండిక్స్ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రేణుకా ప్రసాద్ మాట్లాడుతూ ఉచిత వైద శిబరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 6వ వార్డ్ ముఖ్య నాయకులు అబ్దుల్ కలాం, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు మోమిన్ యూసుఫ్, మార్కెటింగ్ మేనేజర్ విజయ్ యాదవ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు సోమవారం జరుగు పోలీసు స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున అర్జీదారులు స్పందన కార్యక్రమానికి రావొద్దని తెలిపారు. జిల్లాలోని మిగతా అన్ని పోలీసు స్టేషన్‌లలో, సిఐ కార్యాలయాలలో పోలీసు స్పందన కార్యాక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తాం

- పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షులు నాగేంద్ర చారి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు జడ్పీహెచ్ హైస్కూల్ నందు పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహ నగదు బహుమతులు అందిస్తామని పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షులు నాగేంద్ర చారి తెలిపారు. ఆదివారం స్థానిక ఏఎన్ఆర్ జడ్పీ హైస్కూల్ నందు పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆ సంఘం ట్రస్ట్ ఏర్పాటుపై వివిధ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం నాగేంద్ర చారి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థుల తరపున సహకారం అందిస్తామన్నారు. పదవ తరగతిలో మెరిట్ విద్యార్థులకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ. 5 వేలు అందించేందుకు కమిటీ తీర్మానం చేశామన్నారు. తన సొంత ఖర్చులతో నాలుగు బెంచీలను పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు పూర్వపు విద్యార్థులు ముందుకు రావాలని, ప్రతి ఒక్కరు కమిటీలో సభ్యత్వాన్ని పొందాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జయశంకర్ రెడ్డి, సభ్యులు రమణారెడ్డి, దేవ భూషణం, రామారావు, ఇస్మాయిల్, రోషి రెడ్డి, రాంప్రసాద్, హుస్సేన్, రోషన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థులు సభ్యత్వాన్ని పొందుతున్న దృశ్యం

అంజుమన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల

అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన 220 మంది ముస్లిం విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 3 వేల చొప్పున రూ. 6 లక్షల 20 వేలు చెక్కులు ఆదివారం పంపిణీ చేశారు. అంజుమన్ సంస్థ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఫరీదా షహవత్, బైరమల్ బ్రాంచ్ మేనేజర్ సురేంద్ర, జమాఆతె ఇస్లామీ హింద్ అధ్యక్షులు అబ్దుల్ సమద్, ఇమాముల సంఘం అధ్యక్షులు హాఫీజ్ అమ్జద్ బాషా సిద్దీఖ్, అంజుమన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ హఖ్, కార్యదర్శి వరంగల్ యుండి గౌస్, సభ్యులు హిదాయతుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఖుద్దూస్ మాట్లాడుతూ గత 12 ఏళ్ళ గా అంజుమన్ ఆధ్వర్యంలో ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మహిళలకు సామూహిక వివాహాలకు ఒక్కో జంటకు రూ. 40 వేలు బహుకరిస్తున్నట్లు చెప్పారు. ఫరీదా మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి సేవలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని అన్నారు. అబ్దుల్ సమద్, హాఫీజ్ అమ్జద్ బాషా సిద్దీఖ్ అంజుమన్ సేవలను ప్రశంసించారు. అనంతరం అతిథుల చేతులు మీదుగా చెక్కులను పంపిణీ చేసారు.

చెక్కులు పంపిణి చేస్తున్న దృశ్యం

రామతీర్థం వాసవి సత్రానికి విరాళం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని రామతీర్థం (పుట్టాలమ్మ) క్షేత్రంలో వాసవి సత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆళ్లగడ్డకు చెందిన బైసాని రవి ప్రకాష్, ఉమా మహేశ్వరమ్మ దంపతులు ఆదివారం రూ.15,116 విరాళంగా అందజేసినట్లు కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త, టిఎంసి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ రామతీర్థం క్షేత్రంలో ప్రతి ఆదివారం విశేష సంఖ్యలో భక్తులు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, పరశురామేశ్వర స్వామి, కొండపైన గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనార్థం వస్తుంటారని తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహణ కోసం శ్రీ వాసవి సత్రాన్ని నెలకొల్పామని, భక్తులు ధన, వస్తు రూపేనా అన్నదానం నిర్వహణ కోసం ఆర్థిక సహకారం అందించవచ్చున్నారు.

పేరుసోములలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సంజామల : పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పేరుసోమల గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఎంపిటిసి చిన్నబాబు, ఆకుమల్ల నాగేశ్వర్ రెడ్డి, రామిరెడ్డి పల్లె సర్పంచ్ సోమ సుందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆల్వకొండ ఎస్సి బాబు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లన, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళను ఢీకొట్టిన లారీ - తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గడివేముల : మండలంలోని చిందుకూరు గ్రామంలో ఆదివారం ఉదయం జెల్ల నాగలక్ష్మమ్మను లారీ ఢీకొట్టడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. వివరాలు.. జెల్ల నాగ లక్ష్మమ్మ గ్రామంలోని వడ్డే రామచంద్రుడు ఇంటి ముందు కొళాయి నీటిని బిందెలో పట్టుకొని రోడ్డు ఎడమవైపు నడుచుకుంటూ వెళుతుండగా జిందాల్ ఫ్యాక్టరీ నుండి వస్తున్న లారీ డ్రైవర్ ఇలియరాజా అతి వేగంగా అతి జాగ్రత్తతో హారన్ కొట్టకుండా నడిపి ఢీకొట్టాడు. జెల్ల నాగలక్ష్మమకు రెండు కాళ్ళ విరిగి నుజ్జు నుజ్జు అయ్యాయి. వెంటనే నాగలక్ష్మమ్మను నంద్యాల ఆస్పత్రికి తరలించారు. నాగలక్ష్మమ్మ తమ్ముడు బింగి నాగరాజు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల పట్టనంలోని జగజ్జనని నగర్‌లో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ 117వ జయంతిని ఆదివారం నిర్వహించారు. చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ స్వాతంత్ర సమరంలో ఆంగ్లేయులకు ఎదురొడ్డి పోరాడిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. అలాంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కిరణ్ కుమార్, భాష, సలహాదారులు నబి రసూల్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర సమరయోధుల జయంతి

ఆళ్లగడ్డ : భారత స్వాతంత్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర ఆజాద్‌ల జయంతి వేడుకలను ఆదివారం అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని బిసి వసతి గృహంలో సంక్షేమ అధికారి సురేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామకృష్ణ, విద్యార్థులతో కలిసి బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర ఆజాద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమీర్ భాష మాట్లాడుతూ నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రం ఎందరో మహాత్ముల త్యాగ ఫలితమే అని కొనియాడారు.

నంద్యాలలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

కొత్తూరు ఆలయంలో ప్రముఖులు

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని కొత్తూరు సుబ్బారాయుడు స్వామి వారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అధిక శ్రావణమాసం కావడంతో జిల్లా స్థాయి అధికారులు స్వామి సేవలో పాల్గొన్నారు. కర్నూల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కళ్యాణి దంపతులు, నంద్యాల జూనియర్ సివిల్ జడ్జి అర్చన భర్త, తెలంగాణ రాష్ట్ర గద్వాల సీనియర్ సివిల్ జడ్జి ప్రభాకర్, కర్నూల్ పట్టణ ఎస్సి, ఎస్టి కేసుల డిఎస్పీ యుగంధర్ బాబు, జయజ్యోతి సిమెంట్స్ జనరల్ మేనేజర్ శివప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరికి వీరయ్య స్వామి, నారాయణ స్వామి, సురేష్ కుమార్ శర్మ, దేవస్థానం ఈఓ రామకృష్ణ, సిబ్బంది సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

తీర్థ ప్రసాదాలు, శే ష వస్త్రాలను అందజేస్తున్న దృశ్యం

గణపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని ఎం.గణపురం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. టిడిపి నంద్యాల పార్లమెంటు ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో గణపురం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించామన్నారు . ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భవిష్యత్తు గ్యారెంటీతో ఎన్నో పథకాలను ప్రవేశపెట్ట బోతుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.1500 పింఛన్, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ఇంకా ఇలాంటి ఎన్నో పథకాలను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టబోతున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు వేణు, శ్రీకాంత్, రాజేష్, మన్సూర్, నాగేశ్వరరావు, మహబూబ్ బాషా, శీను, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

నల్లమల అడవిలో వజ్రాల వేట

ప్రజాశక్తి - మహానంది.

మహానంది మండలం గాజులపల్లె గ్రామ సమీపంలోని నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారిలోని నల్లమల్ల అడవిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసర ప్రాంతంలో ప్రజలు పెద్ద ఎత్తున వజ్రాల అన్వేషణకు తరలివస్తున్నారు. జిల్లాలో గత కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి వజ్రాలను అన్వేషిస్తున్నారు. ఇక్కడ వజ్రాలు దొరుకుతాయని ప్రజలు తమ అదృష్టానికి పరీక్షించుకుంటున్నారు. ఇక్కడ ఎన్నో సంవత్సరాలుగా తొలకరి జల్లులు కురిసినప్పుడు వజ్రాలు దొరుకుతాయని ప్రజల నమ్మకం. వర్షం పడగానే ఏదో ఒక వజ్రం దొరుకుతుందని, దాంతో లక్షధికారులు కావొచ్చనే ఉద్దేశ్యంతో వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి తరలివస్తున్నారు.

వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు

ఆగస్టు 15న కొండపై వంద అడుగుల జాతీయ జెండా ఏర్పాటు

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని ఆంజనేయస్వామి కొండపై ఆగస్టు 15న వంద అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేసి ప్రారంభిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం ఆంజనేయస్వామి కొండపై జాతీయ జెండాను ఏర్పాటు చేసే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిందాల్ ఇండస్ట్రీస్ ఆర్థిక సౌజన్యంతో వంద అడుగుల జాతీయ జెండాను కొండపై రూ. 14 లక్షల 50 వేలతో ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ చుట్టూ గార్డెన్‌తో పాటు ఐ లవ్ డోన్ సింబల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేసి ఆగస్టు 15న భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ఎగరవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, జిందాల్ సీనియర్ మేనేజర్ కేశవరెడ్డి, శేఖర్ రెడ్డి, కౌన్సిలర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తదితరులు

నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నేడు సోమవారం జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహారాజ శ్రీ డోన్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు :
ఐ.పి.నెంబరు 19/2023

షేక్ హుస్సేన్ బాష, వయస్సు 58 సం॥,
తండ్రి షేక్ మక్తుమ్ R/o ఇంటి నెంబర్ 53-20-16/10,
చైతన్య నగరు మద్దిలపాలెము, విశాఖపట్నం ప్రస్తుతం
పెద్ద మల్కాపురం గ్రామనివాసి, చిన్న మల్కాపురం (పోస్టు),
డోన్ మండలం, నంద్యాల జిల్లా. ...అర్జీదారు/Debtor

V/s

R1. బలిజ గాండ్ల జగదీష్, వయస్సు 41 సం॥లు,
తండ్రి బలిజ గాండ్ల ప్రసాదు (LIC ప్రసాద్),
ఇంటి నెంబరు 9-4- R/o పెద్ద మల్కాపురం గ్రామము,
చిన్న మల్కాపురం (పోస్టు), డోన్ మండలం, నంద్యాల జిల్లా.
R2. షేక్ వలిబాష, వయస్సు 45 సం॥లు,
తండ్రి జమాల్ సా ఇంటి నెంబరు 23-243-7
హనుమాన్ నగర్, బేతంచెర్ల టౌన్ & మండలం,
నంద్యాల జిల్లా.
R3. షేక్ ఖలీల్ బాష, వయస్సు 42 సం॥లు,
తండ్రి హుస్సేన్ బాష, ఇంటి నెంబరు 7-81,
పెద్ద మల్కాపురం గ్రామము, డోన్ మండలం, నంద్యాల జిల్లా.
R4. షేక్ అబ్దుల్ కరీం, వయస్సు 40 సం॥లు,
తండ్రి జబ్బారు మియ్య, ఇంటి నెంబరు 23-243-5,
హనుమాన్ నగర్, బేతంచెర్ల టౌన్ & మండలం,
నంద్యాల జిల్లా. ...రెస్పాండెంట్ 1 to 4/ Creditors

నంద్యాల జిల్లా బేతంచెర్ల పట్టణం మరియు బేతంచెర్ల మండలం మరియు పెద్దమల్కాపురం గ్రామం, చిన్న మల్కాపురం పోస్టు, డోన్ మండల ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు ఐ.పి.నెంబరు 19/2023 అర్జీదారు షేక్ హుస్సేన్ బాష, చైతన్య నగరు, మద్దిలపాలెం, విశాఖపట్నం, ప్రస్తుతం పెద్దమల్కాపురం గ్రామ నివాసి అయిన, చిన్న మల్కాపురం పోస్టు, డోన్ మండలం, నంద్యాల జిల్లా. స్లాబ్స్ (Slabs) వ్యాపారం లో వచ్చిన నష్టముల వలన తనను దివాలా దారునిగా తీర్మానం చేయమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు (ఐ.పి.పిటిషన్‌ను) చేసినాడు. ఇందుపైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 03-08-2023 తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొన వలెను. లేనియెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 03-08-2023

వెలుట్ల రామలింగయ్య,
అర్జీదారు పరం అడ్వకేటు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ నెంబరు : 9346438116

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.199/2022

జి.అశోక్‌గౌడ్ వగైరా. ...వాదులు

-వర్సెస్-

యం.కురువ అంకన్న వగైరా. ...ప్రతివాదులు

1వ ప్రతివాదికి దావా సమన్లు

యం.కురువ అంకన్న తండ్రి యం.పెద్దసుంకన్న,
ఇంటి.నెం.8-92, కురువవీధి, నందికొట్కూరు,
కర్నూలు జిల్లా, ప్రస్తుతం నంద్యాల జిల్లా.

పై నెంబరు దావాలో వాదులు, ప్రతి వాదుల దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో ప్రవేశించ కుండా పర్మినెంటు ఇంజక్షన్ ఉత్తర్వు ఇప్పించమని మరియు దావా ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినారు. కావున ఇందులో 1వ ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 03-08-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూల ముగా తెలియజేయడమైనది.

Shedule :

Item No.1. The opensite consisting of Plot No.352, 353, 360. situated in Zaitun Bi Nagar in Joharapuram village. within Sub-Regn Dist.of Kurnool within Regn-Dist of Kurnool Relating to Sy Nos. 142,143, within the following

Boundaried:
East : Others Plot in same SY.No.'s
West : 25 feet Road
North : Plot of V.Bhaskar Goud
South :40 feet Road.

Item No.1. The opensite consisting of Plot No.351,361,362. situated in Zaitun Bi Nagar in Joharapuram village. within Sub-Regn Dist.of Kurnool within Regn-Dist of Kurnool Relating to Sy Nos. 142,143, within the following

Boundaried:
East : Others Plot in same SY.No.'s
West : 25 feet Road
North : Plot of Chitrala Chakrapani.
South :Plot of G.Ashok Goud.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 03-08-2023

పి.మస్తాన్‌వలి,
కడియాల రామ పుల్లయ్య,
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.